క్లుప్తంగా

క్రీడలకు మరింత ప్రోత్సాహం



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో క్రీడలను మరింత ప్రోత్సాహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రంపచోడవరంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి గత వారం ఆయన ప్రాంభించిన విషయం తెలిసిందే. ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా పదో తరగతి లోపు గల బాల, బాలికలకు ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణను ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులో ఉన్న ఇండోర్ సింథటిక్ బ్యాడ్మింటన్ కోర్టును, ఇతర ఇండోర్ గేమ్స్ లను వినియోగించుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వేసవి ఉచిత శిక్షణ శిబిరాల్లో రిజిస్ట్రేషన్ కోసం 9014229091, 6403049191 నంబర్లకు సంప్రదించాలని పీవో సూరజ్‌గనోరే సూచించారు. ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన పీవోకు స్థానికులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

తాళ్లపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 35 మంది రోగులకు వైద్య సేవలందించినట్టు లాగరాయి పీహెచ్‌సీ డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. బీపీ, సుగర్ సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరానికి వచ్చిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, 104 డీఈఓ శ్రీనివాస్, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

గంగవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆధార్ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. గంగవరం పిహెచ్‌సీ పరిధిలో ఎవరైనా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఎవరికైనా ఆదార్ అప్ డేట్ చేస్తామన్నారు. ఆధార్ కార్డులోని అడ్రస్‌లోని వివరాలు మార్పు, చేర్పులు, ఫోన్ నంబర్ అనుసంధానం, కొత్త ఆధార్ తదితర సేవలను నామమాత్రపు రుసుముతో అందిస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

250 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కొయ్యూరు: డౌనూరు చెక్‌పోస్టు వద్ద 245 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై సంచులు వేసుకుని వస్తుండగా వారిలో ఒకరు తమను చూడగానే పారిపోయారని, మరొకరిని అదుపులో తీసుకున్నామని, గొలుగొండ మండలం విప్పలపాలెంకు చెందిన లగుడు శ్రీను గుర్తించినట్టు చెప్పారు.సంచులను పరిశీలించగా అందులో 245 మద్యం సీసాలు లభ్యమైనట్టు తెలిపారు. వారు కొన్ని గ్రామాలకు క్వార్టర్ మద్యం సీసాలను సరఫరా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సంక్షేమం,అభివృద్ధి



జీకేవీధిలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు

- గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం
- తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



తడ్డపల్లిలో ప్రచారం చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు



చోడిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పెదబయలు వారపు సంతలో ప్రచారం చేస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: జనమంతా జగన్ వైపే ఉన్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ అన్నారు. పెదలబుడు పంచాయతీ కేంద్రంలో ఆయన సోమవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగుతోందన్నారు. ఏజెన్సీలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. చంద్రబాబు అబద్ధాల పుట్ట అని, ప్రకటలన్నీ మోసపూరితమన్నారు. కుట్ర రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యప్రాంతాన్ని విస్మరించిన చంద్రబాబుకు గిరిజనులు తగిన విధంగా బుద్ధి చెప్పారన్నారు. ఇప్పుడు బీజేపీ, జనసేనతో జతకట్టి టీడీపీ వస్తుందని, మరోసారి గుణపాఠం చెప్పేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న భావితరాలు బాగు కోసం జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. గిరిజనుల అభ్యున్నతి, మన్యప్రాంతం అభివృద్ధి చేసిన జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో భాగంగా మోసాల బాబుని నమ్మొద్దు... అబద్ధాల మేనిఫెస్టో మనకొద్దు నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు ఆనంద్, భగత్‌రాం, దేవదాసు, లక్ష్మణ్, రామారావు, గోపాల్, సుధ పాల్గొన్నారు.

అరకులోయ/ హుకుంపేట/దుంబ్రిగుడ (అరకులోయటౌన్)/పెదబయలు/ముంచంగిపుట్టు: అరకులోయ మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో, హుకుంపేట మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో, డుంబ్రిగుడ మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దళపతి తుమ్‌నాథ్, సద్దు, సుమన్ సమక్షంలో, పెదబయలు మండలంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్స సన్యాసి. సర్పంచ్ పోయిభ బాలయ్య దొర ఆధ్వర్యంలో, ముంచంగిపుట్టు మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అరకులోయ వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్ కుమార్, రాంచందర్, మండల ప్రధాన కార్యదర్శి అప్పలస్వామి, హుకుంపేట జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంబిడి చిన్నబ్బి, ముంచంగిపుట్టులో ఎంపీపీ సీతమ్మ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జగబంధు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

పాడేరు/జీకే వీధి/జి.మాడుగుల/కొయ్యూరు/చింతపల్లి రూరల్: పాడేరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా పాడేరు మండలంలో జరిగిన ప్రచారంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగన్నదొర, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సర్పంచ్‌లు అప్పలకొండ, సన్నిబాబు, చిట్టిబాబు, భిమలమ్మ, రాంబాబు, ఎంపీటీసీలు నర్సింహమూర్తి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధి ఆర్.వి.నగర్‌లో జరిగిన ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ , వైస్ ఎంపీపీ అనంద్, సర్పంచ్ సుభద్ర, కో–ఆప్షన్ సభ్యులు దాహుద్, ఎంపీటీసీ సభ్యులు నాగమణి తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండం నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ బి.చినకుమారి, కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, జేసీఎస్ కన్వీనర్ ఎల్.కళ్యాణం, మండల పార్టీ ఉపాధ్యక్షురాలు నీలమ్మ తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలో నిర్వహించిన ప్రచారంలో ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, అంబటి నూకాలు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ పాట్టిక పోతురాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్‌లు శ్రీను, సోమన్నదొర, పొట్టిక శ్రీను, సెగ్గే సన్యాసిరావు, కోడా రాజుబాబు, నూకాలమ్మ, చంద్రరావు, సత్యవతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు గంగాధర్, సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మల్లేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, సావిత్రి, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో జరిగిన ప్రచారంలో మండల సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, సర్పంచ్ రమణమ్మ , ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, వనుము పద్మ, కో–ఆప్షన్ సభ్యులు నాజర్ వలీ, ఎస్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు సోమరాజు, జిల్లా పార్టీ యువజన విభాగ కమిటీ కార్యదర్శి మచ్చిరాజు, నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు, చెట్టి వినయ్, తదితరులు



భీమవరంలో సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు



సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నేతలు



చుంచుంపుడిలో ప్రచారం చేస్తున్న మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత



వంతాలలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ ప్రజాప్రతినిధులు



అరకులోయలో జగనన్నకే మద్దతు తెలియజేస్తున్న గ్రామస్తులు



పట్టంలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



పులిగొందిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ రమణమ్మ

రాష్ట్ర పురోగతి జగనన్నతోనే సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పక్కన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు, మరింత ఆర్థిక భరోసా, మన్య ప్రాంతం అభివృద్ధి కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి అన్నారు. మండల కేంద్రంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే మరెక్కడ లేని విధంగా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. గిరిజనులకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు రైతు భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని ఒక్క గ్రామానికి కూడా రహదారి నిర్మాణం జరగలేదన్నారు. చంద్రబాబు పాలనలో గిరిజనులకు ఒక్క పథకం అమలుజరగలేదన్నారు. వైఎసోస్‌ర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న పాలనలో గిరిజన ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రతి గ్రామానికి తారురోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. పాడేరులో మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆస్పత్రుల్లో అధునాతన సదుపాయాలతో పాటుగా పూర్తిస్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు నియామకం, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదవాడి ఇంటి వద్దకే వైద్యం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఇంటింటి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అడ్డుకున్నారన్నారు. వీరి కుట్రలను ప్రజలు తిప్పి కోట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను గెలిపించాలని కోరారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్స సన్యాసి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మాజీ జెడ్పీటీసీలు జర్సింగి గంగాభవాని, కొంటా సూర్యనారాయణ, నాయకులు కనకరాజు, తమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ



జంగాలతోటలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

సీలేరు: గాలికొండ పంచాయతీ పరిధిలో కొండజర్త, మైనకోట, గొడుగురాయి, ముగ్గురేవుల, పెద్దలంక, పాత్రునిగుంట గ్రామాల్లో ఎస్‌ఐ రామకృష్ణ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ చొరవతో మావోయిస్టుల ప్రభావిత గ్రామాల్లో రహదారులు, సెల్ టవర్ల నిర్మాణం, యువతకు ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువతకు వాలీబాల్ కిట్లను, రోగులకు మందులు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

వై.రామవరం: మండలంలో చామగడ్డ పంచాయతీ జంగాలతోటలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పర్యటించారు. రానున్న ఎన్నికల్లో ఎవరి ప్రలోభాలకు తలొగ్గకుండా, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామ యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్.నాయుడు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

చింతూరు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ మంగళవారం చింతూరులో భారీ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి సోమవారం తెలిపారు. ఈ రోడ్‌షో లో అరకు పార్లమెంటు అభ్యర్థి గుమ్మ తనూజరాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోడ్‌షో నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధుల తరలిరావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ ప్రచారం

వీఆర్ పురం: వడ్డిగూడెం పంచాయతీ వడ్డిగూడెం, వీఆర్ పురం,బీసీ కాలనీ గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి ఎమ్మెల్సీ అనంతబాబు మంగళవారం ఎన్నికల ప్రచారం చేస్తున్నట్టు పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు చెప్పారు.

బీఎస్పీ అభ్యర్థుల ప్రచారం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఎస్పీ ఎంపీ అభ్యర్థి అవశ్యలహరి

చింతూరు: బీఎస్పీ తరపున పోటీచేస్తున్న అరకు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వారం అవశ్యలహరి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కాకూర్ కన్నంరెడ్డి సోమవారం చింతూరులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి పోరాడాతమని చెప్పారు. నాయకులు మంగిరెడ్డి, సుశీల, కృష్టారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నేతల ఎన్నికల ప్రచారం



కొత్తూరుపాడులో ప్రచారం చేస్తున్న నేతలు

జి.మాడుగుల: అరకు పార్లమెంట్ సీపీఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సయ్య, కాంగ్రెస్ అభ్యర్థి బుల్లిబాబుకు మద్దతు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, ఉపాధ్యక్షుడు కొర్రా సర్బునాయుడు, సీపీఎం నాయకులు కోరారు. వంజరి పంచాయతీ కొత్తూరుపాడు, మూలకాయపుట్టు, చేరువువీధి, గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. నాయకులు చిన్నమ్మి, భాస్కర్, నాగేశ్వరరావు, రాజు, మల్లేశ్వరరావు, సాల్మన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నేత మృతి

ముంచంగిపుట్టు: మండలంలో గల దారెల పంచాయతీ పెద్దపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సచివాలయ కన్వీనర్ కిల్లో జయరాం(40) గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిని గుమ్మ తనూజారాణి,, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు,ఎంపీటీసీలు సోమవారం పెద్దపేట గ్రామానికి వెళ్లి జయరాం మృతదేహంపై వైఎస్సార్‌సీపీ జెండాను కప్పి, నివాళులర్పించి, భార్య చంచులాను ఓదార్చారు. దహన సంస్కరణ నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వైఎస్సార్‌సీపీ నిత్యం అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాల్గుణ, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తనూజరాణీ,మత్స్యలింగంలు భరోసా ఇచ్చారు. ఎంపీపీ సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జగబంధు, జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతూరు: స్థానిక 220/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ మలాకీ సోమవారం తెలిపారు. ప్రత్యామ్నాయంగా ఎటపాక సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఉందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా పుష్పోత్సవం

మునగపాక: స్థానిక పంచాయతీ వీధిలోని పాలేశ్వర భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి పుష్పోత్సవ ఘనంగా జరిగింది. శివ పార్వతుల కల్యాణంలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

నేడు తాళ్లమ్మ జాతర

యలమంచిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారి జాతరను మంగళవారం నిర్వహించడానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. మండలంలో ప్రసిద్ధి చెందిన తాళ్లమ్మతల్లి జాతరను పురుషోత్తపురం, కొత్తలి, పేరంటాలపాలెం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, నాయనమ్మపాలెం గ్రామాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. సోమవారం రాత్రి పురుషోత్తపురం గ్రామంలో అమ్మవారి ఘటాలు ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సంబరం చేశారు.భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సెట్టింగ్‌లు,వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.